వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 145 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | నవంబర్ 2024 | వెల : రూ 10/-












తరిగొప్పుల అమరేందర్ హైకోర్టు న్యాయవాది

COVENOR
LEGAL CELL, HUMAN RIGHTS & RTD Dep..(TPCC)

తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

వీలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

+91 9381910611 , 7989289492


www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 145 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | నవంబర్ 2024 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|




## బెంగళూరు చేరుకున్న హైడ్రా బృందం

- చెరువుల పునరుద్ధరణ తీరుపై అధ్యయనం
- వర్షాకాలంలో వరదల నివారణ చర్యలపైనా స్టడీ

హైదరాబాద్,

బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ తీరును హైడ్రా పరిశీలిస్తోంది. ఇక్కడ గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించారు. వీటిని పరిశీలించేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ బెంగళూరు చేరుకున్నారు. రెండు రోజుల పాటు ఆయన నగరంలో చెరువుల పునరుద్ధరణపై అధ్యయనం చేయనున్నారు. -మిగతా 3 లో



# నేడు యాదాద్రికి సీఎం రేవంత్

- పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు
- యాదాద్రి అభివృద్ధిపై అధికారులతో సమీక్ష
- ఉదయం 8:45 గంటలకు ప్రత్యేక పూజలు
- వలిగొండ వద్ద మూసీపునరుజ్జీవ యాత్ర ప్రారంభం
- మూసీ పరివాహక ప్రాంతంలో 6కిలోమీటర్లు పాదయాత్ర

హైదరాబాద్,

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన పుట్టిన రోజును శుక్రవారం జరుపు కోనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు ఆయన తన కుటుంబ సమేతంగా యాదాద్రికి -మిగతా 3 లో







## తెలంగాణలో పలువురు డీఎస్పీల బదిలీ

- డీజీపీ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్,

తెలంగాణలో పలువురు డీఎస్పీ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ ఇవాళ (గురువారం) ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న అధికారి ఎస్ఆర్ దామోదర్ రెడ్డిని అంబర్‌పేట్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. -మిగతా 3 లో

11




## 11నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

- పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లుగా పరిస్థితి
- ధాన్యం కొనే దిక్కులేక రైతుల అవస్థలు
- దళారుతలో కుమ్మక్కయిన మిల్లర్లు
- సంస్థాగతంగా బీజేపీ బలోపేతం చేయాలి
- ప్రజల సమస్యలపై ఎక్కడిక్కడ పోరాటాలు
- పార్టీ కార్యశాలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,

రాష్ట్రంలో 11 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయారని వివరించారు. అలాగే ఆరు గ్యారెంటీల అమలులో విఫలం అయ్యారని అన్నారు. సంస్థాగతంగా -మిగతా 3 లో



## కుటుంబ సర్వేను విజయవంతం చేయండి

- చిత్తశుద్ధితో కృషి చేయాలని అధికారులకు సిఎస్ ఆదేశం

హైదరాబాద్,

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు చిత్త శుద్ధితో కృషిచేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై -మిగతా 3 లో

# జైలుకు వెళ్లడానికి నేను సిద్ధమే



- యోగా చేసి ట్రిమ్ముగా తయారై వస్తా
- నీ ఉడత బెదిరింపులకు భయపడేది లేదు
- ఈ రేసింగ్‌తో హైదరాబాద్ ఇమేజ్ పెంచా
- మెఘా కంపెనీపై కేసు పెట్టే దమ్ముందా
- మీడియా సమావేశంలో కేటీఆర్ హాట్ కామెంట్స్

హైదరాబాద్,

జైలుకు వెళ్లేందుకు నాకు ఎలాంటి అభ్యంతరం లేదని బిఆర్ఎస్ నేత కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నా మీద ఎందుకు కేసులు పెడుతావ్.. హైదరాబాద్ ఇమేజ్ పెంచినందుకా..? అని సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ -మిగతా 3 లో




## మధ్యలో నిబందనలు మార్చరాదు

- ఉద్యోగ నియామకాల ఎంపిక ప్రక్రియ
- సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ,

సుప్రీంకోర్టు గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎంపిక పక్రియ ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలకు సంబంధించిన నిబంధనలను మార్చలేమని కోర్టు పేర్కొంది. పోస్టుల -మిగతా 3 లో



## మహారాష్ట్రలో హోరాహోరీ


- మోడీ ప్రతిష్టకు సవాల్‌గా ఎన్నికలు
- బలపడుతున్న ఇండియా కూటమి
- ఒక్కో పార్టీకి ఒక్కో ప్రాంతంలో బలం
- రాష్ట్రంలో మొత్తం 288 శాసనసభ స్థానాలు 288

ముంబయి,

దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికల సమరం సాగబోతోంది. ఈ ఎన్నికలలో ఆరు కీలక పార్టీలు తలపడుతున్నాయి. గతంలో శివసేనను చీల్చి -మిగతా 3 లో

## భుజాలు తడుముకుంటున్న కేటీఆర్

- అరాచకాలు బయటపడుతుంటే భయం పట్టుకుంది
- చట్టం తనపని తాను చేసుకు పోతుంది
- రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం
- తొర్రూరు మార్కెట్ కమిటీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి



మహబూబాబాద్,

'గుమ్మడి కాయల దొంగ అంటే.. భుజాలు ఎందుకు తడుముకుంటున్నవ్ కేటీఆర్..?' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్.. నువ్వు చేసిన తప్పేంటో నీకు తెలుసు.. పడబోయే శిక్ష ఏంటో నీకు తెలుసు' అని అన్నారు. 11 నెలలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ అరాచకాలు -మిగతా 3 లో

# బిష్ణోయ్, దావూద్ టీ షర్టులు

– విక్రయిస్తున్న ఆన్‌లైన్ సంస్థలపై కేసు




**ముంబయి**
గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్, అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంలను కీర్తిస్తూ ఉన్న టీ–షర్టులను విక్రయిస్తున్న కొన్ని ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు, ఈ–కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లపై మహారాష్ట్ర పోలీసు సైబర్ విభాగం కేసు నమోదు చేసినట్లు అధికారులు గురువారం తెలిపారు. 'నేరస్థులను ఆరాధించే విధంగా ఉత్పత్తులు రూపొందించడం, యువ మనస్సులను ప్రతికూలంగా ప్రభావితం చేసే ప్రచారం సమాజానికి గణనీయమైన ప్రమాదాన్ని కలిగిస్తాయి' అని ఒక అధికారి తెలిపారు. సైబర్ సెక్యూరిటీ అధికారుల నిఘాలో ఫ్లిప్‌కార్ట్, అలీఎక్స్‌ప్రెస్ వంటి ఈ–కామర్స్ సంస్థలు, టీషాపర్, ఎట్సీ వంటి మార్కెట్ ప్లేస్‌ల్లోనూ బిష్ణోయ్, దావూద్‌లను కీర్తిస్తూ టీషర్టులను విక్రయిస్తున్నట్లు వెల్లడయిందని చెప్పారు. ఇలాంటి అభ్యంతరకరమైన ఉత్పత్తులను విక్రయిస్తున్నందుకు బిఎన్‌ఎస్‌లోని సెక్షన్ 192, 196, 353 కింద, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని నిబంధనల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

# గాయ్...గాయ్ గత్తర చేస్తున్న రేవంత్

–ఎక్స్ వేదికగా హరీశ్‌రావు విమర్శలు



**హైదరాబాద్,**
సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న వాస్తు మార్పులపై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రీన్ టెక్నాలజీ, ఫైర్ సేఫ్టీ నార్మ్స్ తో దేశానికే తలమానికమైన కొత్త సెక్రటేరియట్ నిర్మిస్తే వాస్తు పిచ్చని నాడు రేవంత్ రెడ్డి గాయ్ గాయ్ గత్తర గత్తర చేసిండు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా సెక్రటేరియట్‌కు పూటకో మార్పు చేస్తున్నాడని ఎద్దేవా చేశాడు. వాస్తు దోషం ఉందని ఒక్క గేట్ మార్పు చేయటానికి రూ.4 కోట్లు ఖర్చు పెడుతున్నారని ఇది కదా అసలు సిసలైన కాంగ్రెస్ మార్కు మార్పు అని ఎక్స్ వేదికగా స్పందించారు. ఇకనైనా పాలనపై దృష్టి పెట్టి ప్రజలకు మేలు జరిగే పనులు చేపట్టాలని హితవు పలికారు. ౦

# కొడుకుతో కలిసి తల్లి, సోదరి హత్య



**భువనేశ్వర్,**
ఆస్తి కోసం ఒక వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. కొడుకుతో కలిసి వృద్ధురాలైన తల్లి, సోదరిని హత్య చేశాడు. అగ్నిప్రమాదంలో వారు చనిపోయినట్లు నమ్మించేందుకు ప్రయత్నించాడు. అయితే పోలీసుల దర్యాప్తులో అసలు విషయం తెలియడంతో నిందితులు అరెస్ట్ అయ్యారు. ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నవంబర్ 5న రాత్రి వేళ హటాపాడా ప్రాంతంలోని బిల్డింగ్ మొదటి అంతస్తులో మంటలు, పొగలు రావడాన్ని స్థానికులు గమనించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అక్కడ నివసిస్తున్న 90 ఏళ్ల స్నేహలత దీక్షిత్, ఆమె కుమార్తె అయిన 62 ఏళ్ల సాయిరేంద్రి దీక్షిత్ కాలిన మృతదేహాలను గుర్తించారు. అసహజ మరణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆస్తి తగాదాల నేపథ్యంలో పక్కా ప్లాన్‌తో ఇద్దరు మహిళల హత్య జరిగినట్లు పోలీసులు తెలుసుకున్నారు. స్నేహలత దీక్షిత్ కుమారుడు జగన్నాథ్ తన కుమారుడు సంకేత్‌తో కలిసి తల్లి, సోదరి గొంతునొక్కి హత్య చేశారని పోలీస్ అధికారి తెలిపారు. ఆ తర్వాత వారి మృతదేహాలకు నిప్పుపెట్టి అగ్నిప్రమాదంలో చనిపోయినట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించారని చెప్పారు. స్నేహలత చిన్న కూతురు ఇంద్రాణి ఫిర్యాదు ఆధారంగా హతురాలి కొడుకు, మనవడ్ని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు

## బ్యాడ్మింటన్ అకాడమీకి పీవీ సింధు భూమి పూజ

**అమరావతి,**
విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీకి స్టార్ ప్లేయర్ పీవీ సింధు భూమి గురువారం పూజ చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అకాడమీ నిర్మాణానికి తన తల్లిదండ్రులతో కలిసి గురువారం ఉదయం భూమి పూజ చేశారు. పనులు త్వరగా చేపట్టి ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఈ సందర్భంగా పీవీ సింధు తెలిపారు. ఈ భూమి విషయంలో ఎలాంటి వివాదం లేదని.. ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చినట్లు వివరించారు. ఈ అకాడమీ ద్వారా ఎంతో మంది క్రీడాకారులను తయారు చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అకాడమీకి సంబంధించిన అన్ని వివరాలూ త్వరలోనే వెల్లడిస్తామని ఈ సందర్భంగా పీవీ సింధు వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వం పీవీ సింధుకు విశాఖపట్నంలోని పెదగదిలి కూడలి సమీపంలో భూమి కేటాయించిన విషయం తెలిసిందే

# వ్యాపారానికి కాదు..గుత్తాధిపత్యానికి వ్యతిరేకం

–బిజెపి విమర్శలపై రాహుల్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ,**
తాను వ్యాపార వ్యతిరేకిని కాదని, కేవలం గుత్తాధిపత్యాన్ని మాత్రమే వ్యతిరేకిస్తానని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తనను వ్యాపార వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు భాజపా ప్రయత్నాలు చేస్తోందన్నారు. అందుకే 'ఓ విషయంపై స్పష్టతనివ్వాలని అనుకుంటున్నట్లు వెల్లడించారు. వ్యాపారంలో గుత్తాధిపత్యం కారణంగా మిగతా వారు అవకాశాలు కోల్పోతారని అన్నారు. భాజపా లోని కొందరు వ్యక్తులు నన్ను వ్యాపార వ్యతిరేకిగా చిత్రీకరిస్తున్నారు. ఉద్యోగాల కల్పన, వ్యాపారానికి, ఆవిష్కరణలకు, పోటీతత్వానికి మద్దతు ఇస్తానని అన్నారు. నేను వ్యాపార వ్యతిరేకిని అస్సలే కాదు. గుత్తాధిపత్యానికి, మార్కెట్ నియంత్రణ శక్తులకు వ్యతిరేకం అన్నారు. కేవలం వేళ్ల సంఖ్యలో వ్యక్తులు ఆధిపత్యం చెలాయించడానికి తాను పూర్తిగా విరుద్ధం అన్నారు. మేనేజిమెంట్ కన్‌స్టలెంట్‌గా నా కెరీర్‌ను ప్రారంభించా. వ్యాపార విజయానికి అవసరమైన అంశాలను అర్థం చేసుకోగలను' అని పేర్కొంటూ సోషల్ మీడియాలో రాహుల్ గాంధీ ఓ వీడియో పోస్టు చేశారు. దేశంలో కొందరు వ్యాపారవేత్తలు గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారని ఇటీవల ఓ ఆంగ్ల వార్తా పత్రికకు రాసిన వ్యాసంలో రాహుల్ పేర్కొన్నారు. మార్కెట్‌ను నియంత్రిస్తున్న అటువంటి శక్తుల వల్ల అనేక వ్యాపారాలు క్షీణించాయని, ఉద్యోగాల సృష్టి కూడా కష్టమయ్యిందని అభిప్రాయపడ్డారు. అనేకమంది యువ వ్యాపారవేత్తలు ఇటువంటి గుత్తాధిపత్యాన్ని చూసి భయపడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. దీనిపై భాజపా నుంచి విమర్శలు వ్యక్తం కావడంతో రాహుల్ దీనిపై వివరణ ఇచ్చారు.

# రేవంత్ రెడ్డి ఒకే ఒక్కడు పుస్తకాన్ని ఆవిష్కరించిన పిసిసి చీఫ్



**హైదరాబాద్**
సీఎం రేవంత్ రెడ్డి పై రాసిన ఒకే ఒక్కడు పుస్తకాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కూమార్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విలక్షణమైన నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. చిన్న వయసులో రాజకీయాల్లో డైనమిక్ లీడర్ గా ఎదిగిన వ్యక్తీ రేవంత్ రెడ్డి అని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పాలన చేస్తున్న కేసీఆర్ పైన పోరాటం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఒకే ఒక్కడు పుస్తక ఆవిష్కరణ చేసుకున్నామని తెలిపారు. ఒకే ఒక్కడు పుస్తకాన్ని రచించిన వేణుగోపాల్ రెడ్డి, విజయార్కెకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటి నుంచి ముందుగా రేవంత్ రెడ్డికీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని .. ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఇదిలా ఉండగా.. రేపు (శుక్రవారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

# అక్రమంగా పిజి మెడికల్ సీట్ విక్రయం

–మాజీమంత్రి మల్లారెడ్డికి ఇడి నోటీసులు



**హైదరాబాద్,**
పీజీ మెడికల్ కాలేజీ సీట్లు అక్రమంగా విక్రయించారనే అభియోగాలపై మాజీ మంత్రి సిహెచ్ మల్లారెడ్డికి ఈడీ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. దీనిపై ఈ రోజు జరిగే విచారణకు హాజరు కావాలని ఆయనకు జారీ చేసిన నోటీసుల్లో ఈడీ స్పష్టం చేసింది. దీంతో ఈడీ ఎదుట విచారణకు మల్లారెడ్డి మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేందర్ రెడ్డి హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఈడీకి ఆయన వివరణ ఇచ్చినట్లు సమాచారం. తెలంగాణలో పలు మెడికల్ కాలేజీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లు విక్రయించారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ క్రమంలో ఈడీకి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగింది. అందులోభాగంగా గతేడాది జూన్‌లో మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి నివాసం, మెడికల్ కాలేజీతోపాటు కార్యాలయాలపై ఈడీ సోదాలు నిర్వహించింది. అలాగే 12 మెడికల్ కాలేజీల్లో సైతం సోదాలు చేపట్టింది. ఈ సందర్భంగా కీలక డాక్యుమెంట్లు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్‌డిస్క్‌లను సైతం ఈడీ స్వాధీనం చేసుకుంది. రాష్ట్రంలోని 10 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని 45 సీట్లను బ్లాక్ చేసి విక్రయించినట్లు.. ఈడీ తన సోదాల్లో గుర్తించింది. దాంతో దీనిపై వివరణ ఇవ్వాలంటూ మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డితోపాటు వివిధ ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు ఈడీ నోటీసులు జారీ చేసింది.

# దేశ వ్యాప్తంగా రూ. 558 కోట్ల విలువైన ఆస్తులు జప్తు

–ఓటర్లకు తాయిలాలిచ్చేందుకు తరలిస్తుండగా స్వాధీనం
– కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి




**న్యూఢిల్లీ**
మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో జరిగే ఉప ఎన్నికల సందర్భంగా ఓటర్లకు తాయిలాలు అందించేందుకు తీసుకెళ్తున్న కోట్లాది రూపాయలు పట్టు బడుతున్నాయి. ఇప్పటి వరకూ రూ. 558 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహాలు, ఉచిత వస్తువులను నిఘా ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్నాయి. మొత్తం స్వాధీనం చేసుకున్న వాటిలో నగదు రూ.92.47 కోట్లు. రూ.52.76 కోట్ల విలువైన మద్యం, రూ.68.22 కోట్ల విలువైన డ్రగ్స్, రూ.104.18 కోట్ల విలువైన లోహాలు, రూ.241.02 కోట్ల విలువైన ఉచిత తాయిలాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. మహా రాష్ట్రలో జప్తులు రూ. 280 కోట్లకు చేరుకోగా, జార?ండ్‌లో రూ. 158 కోట్లకు చేరుకున్నాయి. గత ఎన్నికల్లో ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 3.5 రెట్లు పెరిగినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు.

# అమెరికా రాజకీయాల్లో కొత్త శక్తి

–అనూహ్యంగా పైకి వచ్చిన ఎలెన్ మస్క్



**వాషింగ్టన్,**
అమెరికా అధ్యక్ష ఎన్నికలను మస్క్ శాసించాడనటం అతిశయోక్తి కాదేమో. ఇప్పుడెక్కడ చూసినా ఇదే చర్చ సాగుతోంది. మస్క్ ప్రొఫైల్‌లో మాత్రం కొత్త ట్యాగ్ యాడ్ అవ్వడం పక్కాగా కనిపిస్తోంది. అమెరికా రాజకీయాల్లో మస్క్ మార్క్ మొదలుకానుంది. ఆయన తనకున్న ఫాలోయింగ్‌తో పాటు ఇతర పద్దతుల ద్వారా ట్రంప్ గులుపు లక్ష్యంగా పనచేశారని చెప్పవచ్చు. ఈ ఎన్నికలతో కొత్త స్టార్‌గా ఎలాన్ మస్క్ ఆవిర్భవించాడని డొనాల్డ్ ట్రంప్ స్వయంగా పేర్కొనడం విశేషం. అసలు హాఫ్ డెమోక్రట్, హాఫ్ రిపబ్లికన్‌ను అని కొన్నేళ్ల కిందట చెప్పుకొన్న మస్క్ ఇప్పుడు పూర్తిగా ట్రంప్ పక్షం వహించారు. అసలు 2016, 2020 ఎన్నికల్లో డెమోక్రట్ల పక్షానే మస్క్ నిలిచారు. కానీ, బైడెన్ కార్యవర్గంతో ఆయనకు విభేదాల కారనంగా ట్రంప్ వైపు మొగ్గు చూపారు. మస్క్ మొదటి నుంచీ ట్రంప్‌నకు వ్యతిరేకి. 2016 తర్వాత ఒకసారి 'అధ్యక్షుడిగా ఆయన సరైన వ్యక్తి కాదు' అని వ్యాఖ్యానించారు. 2022 మొదట్లో కూడా ట్రంప్ మళ్లీ ఎన్నికల్లో నిలబడకూడదని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. ట్రంప్ పాలనలో నిత్యం చాలా హైడ్రామా ఉంటుందన్నారు. కానీ, మస్క్ ట్విటర్‌ను కొనుగోలు చేశాక ఇద్దరి మధ్య సంబంధాల్లో మార్పు వచ్చింది. అప్పటికే ట్రంప్‌ను సోషల్ మీడియాలు వెలివేశాయి. ఆ సమయంలో మస్క్ ఆయన్ను ఎక్స్ లోకి తిరిగి ఆహ్వానించారు. ట్రంప్ అకౌంట్‌ను పునరుద్ధరించారు. మస్క్ సాధారణంగా తాను తటస్థంగా ఉంటానని చెబుతుంటారు. కొవిడ్ సమయంలో బైడెన్ బాధ్యతలు చేపట్టారు. ఆయన పరిపాలన తీరు, పాలసీలు కొన్ని మస్క్‌కు నచ్చలేదు. వీటిని అతడు బహిరంగంగానే తప్పు పట్టాడు. దీంతో విభేదాలకు బీజం పడింది. 2021లో శ్వేతసౌధంలో విద్యుత్తు వాహనాలపై ఓ సదస్సు జరిగింది. దీనికి అమెరికాలోని పెద్ద కంపెనీ టెస్లాను ఆహ్వానించలేదు. దేశంలో 74శాతం విద్యుత్తు వాహనాలు టెస్లావే. 2021 సెప్టెంబర్లో మస్క్ కంపెనీ స్పేస్‌ఎక్స్ పౌర అంతరిక్ష యాత్రను విజయవంతంగా చేపట్టింది. బైడెన్ తప్ప అందరూ ఆయనకు అభినందనలు తెలిపారు. తాము అనుకున్నది చేయడం సాధ్యం కావడంలేదని మస్క్ ఓ సందర్భంలో అసంతృప్తి వ్యక్తం చేశారు.

# జైలుకు వెళ్లడానికి నేను సిద్ధమే

(మొదటి తరువాయి)

కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఫార్ములా-ఈ రేస్ విషయంలో మీడియాకు చెప్పిందే.. అక్కడ చెబుతా. గవర్నమెంట్‌గా నిర్ణయం తీసుకున్నానని చెబుతాను. హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి దృష్ట్యా నిర్ణయం తీసుకున్నాను. నా మీద కేసులు ఎందుకు పెడుతావ్.. హైదరాబాద్ ఇమేజ్ పెంచినందుకా..? లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చినందుకా..? ప్రపంచపటంలో హైదరాబాద్‌ను నిలబెట్టినందుకా..? బెంగళూరును దాటి హైదరాబాద్‌లో ఐటీ ఎగుమతులు పెంచినందుకా..? పారిపోతాయన్న కంపెనీలను కాపాడినందుకా..? దిగ్గజ కంపెనీలకు డ్రీమ్ డెస్టినేషన్‌గా మార్చినందుకా..? కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసినందుకా..? అని సూటిగా ప్రశ్నించారు. అటెన్షన్ డైవర్షన్ గేమ్‌లతో రేవంత్ రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేడు. నువ్వు ఎన్ని వేషాలు వేసినా.. మేం నిన్ను విడిచిపెట్టం. ఆరు గ్యారెంటీలను వదిలిపెట్టం. అప్పుడప్పుడు నువ్వు గోకినట్టు చేస్తే మేం కూడా వివరణ ఇస్తాం ఎందుకంటే ప్రజలకు వాస్తవాలు తెలియాలి. ఇన్ని చెప్పినా కూడా కేసు పెడుతాం అంటే నీ ఇష్టమున్న కేసు పెట్టుకో అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ తేల్చిచెప్పారు. కేటీఆర్ టార్గెట్ అని పేపర్లలో రాస్తున్నారు. ఆరు గ్యారెంటీల అమలు, వడ్ల కొనుగోలు, రైతుబంధు, దళితబంధు, స్కూటీలు ఇచ్చుడు, తులం బంగారం ఇచ్చుడు, గురుకులాలు బాగు చేసే విషయంలో టార్గెట్ ఉండాలి.. టార్గెట్ కేటీఆర్ కాదు. వేస్తే వేసుకో.. నాకేం ఫరక్ పడేది లేదు. ఓ రెండు, మూడు నెలలు జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతా అంటే నాకేం అభ్యంతరం లేదు. మంచిగా పోతా.. యోగా గిగా చేసుకోని ట్రిమ్‌గా వస్తా.. పాదయాత్ర ఎక్కుతా. నేను భయపడేటోని కాదు. ఈ ఉడుత ఊపులకు భయపడను. గాసిప్స్ పక్కకు పెట్టి.. గవర్నమెంట్ మీద దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. ఇకపోతే మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదకు ఏసీబీని పంపే దమ్ముందా..? అని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. నీవు మొగోనివే అయితే మెగా కృష్ణారెడ్డి కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నన్ను ఏసీబీ విచారిస్తుందట.. ఏసీబీ ఫుల్ పామ్ తెలుసా రేవంత్ రెడ్డికి.. తెలుసనుకో.. బ్యాగులతో తిరిగినోడికి ఎందుకు తెల్వదు. ఏసీబీ అంటే యాంటీ కరప్షన్ బ్యూరో. ఏసీబీని కరప్షన్‌కు వ్యతిరేకంగా వాడాలి. ఇందులో కరప్షన్ ఏడుంది.. కాకరకాయ ఏడుంది. నేను అడుగుతున్నా చెప్పు. ఫార్ములా-ఈ రేస్ హైదరాబాద్‌లో ఉండాలని చెప్పి హెచ్ఎండీఏ నుంచి రూ. 55 కోట్లు పంపిన మాట వాస్తవం. దాంట్ల నేను ఏమైనా దాచుకుంటినా..? నాకు ఏమైనా వచ్చాయ..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ రేస్ రద్దుతో హైదరాబాద్‌కు నష్టం కలిగించినా రేవంత్ రెడ్డి మీద కేసు పెట్టాలి. హైదరాబాద్ ఇమేజ్ దెబ్బ తీశావు. రేవంత్ రెడ్డిది తెలివితక్కువ నిర్ణయం. ఆగస్టు 25న నరికిండు రేవంత్ రెడ్డి.. 2036 ఒలిపింక్స్‌ను ఇక్కడికి తెస్తడట. ఎంత ఖర్చు అయితదో తెలుసా ఈ సీఎంకు. 2016 ఒలిపింక్స్‌కు రియోలో లక్షా 8 వేల కోట్లు, 2020లో టోక్యోలో 2.9 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. ఈ ఖర్చు మన బడ్జెట్ అంత. ఈ మొగోడు ఒలింపిక్స్ హైదరాబాద్‌లో పెడుతాడట. 50 కోట్లకే ఒర్రుతుండు. నీ ముఖానికి అయితదా..? అంతర్జాతీయ ప్రమాణాతో ఈవెంట్ నిర్వహించడం తెలుసా..? అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. చేతనైతే మెగా ఇంజినీరింగ్ మీద పెట్టు కేసు. సుంకిశాలలో గోడ కూలిపోయింది 80 కోట్లు నష్టం వచ్చింది. దమ్ముంటే బ్లాక్ లిస్ట్‌లో పెట్టి మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదికి ఏసీబీని పంపు.. ఈస్టిండియా కంపెనీ అన్నావు కదా..? నీవు మొగోనివి అయితే పంపు.. ఏసీబీ కేసు పెట్టు. అవసరమైతే 50 లక్షలతో దొరికిన బ్యాగ్‌మెన్ మీద ఏసీబీ కేసు పెట్టాలి. ఇవాళ రేస్ రద్దు చేయడం కారణంగా జరిగిన నష్టానికి రేవంత్ మీద ఏసీబీ కేసు పెట్టాలి. మేం బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేశాం. మీరు బ్యాడ్ ఇమేజే క్రియేట్ చేస్తున్నాం. హైడ్రా పేరుతో విశ్వనగరం విజన్‌ను దెబ్బతీస్తున్నావ్ అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు.

# 11 నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

(మొదటి తరువాయి)

భాజపాను బలోపేతం చేసుకోవాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సంస్థాగత ఎన్నికల పక్రియపై కార్యశాల నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు, రిటర్నింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీశాయని చెప్పారు. భాజపాకు సంస్థాగత ఎన్నికల వ్యవస్థ ఊపిరి అని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. మహిళ, యువత, రైతుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సంస్థాగత ఎన్నికలకు తెలంగాణ బీజేపీ సిద్ధం అవుతుంది.. ఈ నెల 15 వరకు సభ్యత్వ సేకరణ కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. నేటితో మెంబర్ షిప్ డ్రైవ్ చివరి దశకు చేరుకుంది. బూత్ , మండల, జిల్లా కమిటీ ల ఎన్నికలపై మార్గనిర్దేశర నిర్వహించేందుకు సిద్ధమైంది బీజేపీ. బూత్ కమిటీ ఎన్నికల షెడ్యూల్ పై చర్చ నిర్వహిస్తున్నారు ఈ నెల 15 నుండి 25 వరకు బూత్ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర , జిల్లా రిటర్నింగ్ అధికారుల నియామకం జరిగిన విషయం తెలిసిందే. తెలంగాణలో బీజేపీ సభ్యత్వం సుమారు 31 లక్షలు దాటిందని అంచనా వేస్తున్నారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచం లోనే అతి పెద్ద పార్టీ బీజేపీ అన్నారు. రెగ్యులర్ గా సంస్థాగత ఎన్నికల నిర్వహించుకుంటున్న పార్టీ బీజేపీ అని తెలిపారు. తెలంగాణ లో సుమారు 35 లక్షలు చేరుకుందని అన్నారు. ఈ నెల 15 వరకు సభ్యత్వ సేకరణ కొనసాగుతుందన్నారు. వివిధ స్థాయిల్లో బీజేపీ కమిటీల్లో 30శాతం కొత్త వారికి అవకాశం ఇచ్చారని తెలిపారు. బూత్ నుండి జాతీయ స్థాయి వరకు సమర్ధులైన వారితో కమిటీ వేసినట్లు వెల్లడించారు. బీజేపీలో కొత్త వారిని చేర్పించాలని, భాగస్వామ్యులను చేయాలన్నారు. ఇతర పార్టీల్లో ఏమి జరుగుతుంది తెలుసు. కుటుంబాల ఆధారంగా నడిచే పార్టీ లు అవి. ఆ పార్టీ లకి తరవాత ప్రెసిడెంట్ అవుతారో ముందే చెప్పొచ్చని తెలిపారు. బీజేపీ మాత్రం ప్రజాస్వామ్యంగా ముందుకు వెళ్తుంది? ఎవరైనా పార్టీ లో అధ్యక్షులు కావొచ్చన్నారు. ఇకపోతే తెలంగాణ పరిస్థితి పెనం నుండి పొయ్యి లో పడ్డట్టు అయిందన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుంది. ఒక కొత్త పెన్షన్ ఇవ్వలేదని మండిపడ్డారు. అప్పులు మాత్రం విపరీతంగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేయాలని కిషన్ రెడ్డి తెలిపారు. ఒక వైపు సంస్థాగత అంశాల పై దృష్టి పెడుతూనే.. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. ప్రజలకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోలు కి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లు, మధ్య దళారులతో కుమ్మక్కు అయ్యి రైతులకు నష్టం కలిగిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి కానీ పనులు మాత్రం జరగడం లేదన్నారు. ఇక్కడ ఇచ్చిన హామీలు అమలు చేసినట్టు మహారాష్ట్రలో దుర్మార్గంగా ప్రకటనలు ఇచ్చుకుంటున్నారు

# మధ్యలో నిబంధనలు మార్చరాదు

(మొదటి తరువాయి)

ఎంపిక పక్రియ ప్రారంభమైన తర్వాత నియమాలను మధ్యలో మార్చలేమని సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పింది. ఈ కేసు రాజస్థాన్ హైకోర్టులో ఓ ప్రభుత్వ పోస్టు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించినది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పుల చెప్పింది. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. జస్టిస్ హ్రిషికేశ్ రాయ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. 2008లో కె.మంజుశ్రీ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బెంచి సమర్థించింది. ఆ కేసు తీర్పు సరైనదని.. దానిని తప్పు అని చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది. 'ప్రభుత్వాలు నియామక పక్రియకు ముందే నిబంధనలు సిద్ధం చేసి ఆ తర్వాతే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించాలి. చివరికి ఖాళీలను పూరించిన తర్వాత ఆ పక్రియ ముగుస్తుంది. నిబంధనలు మార్చొచ్చని ముందుగానే చెబితే పర్వాలేదు. నియామక పక్రియ నిబంధనలు ఎవరికి నచ్చినట్లు వారు మార్చడానికి వీల్లేదు. కచ్చితంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలి. మధ్యలో నిబంధనలు మార్చి అభ్యర్థులను ఇబ్బందిపెట్టరాదు.' అని ధర్మాసనం పేర్కొంది.

# మహారాష్ట్రలో హోరాహోరీ

(మొదటి తరువాయి)

దానిని చికాకు పెట్టిన మోడీకి ఇప్పుడు ఈ ఎన్నికలు సవాల్ లాంటివే. శివసేనను చీల్చి ఏక్‌నాథ్ షిండేను సిఎంగా చేసినా...ఫలితం లేదు. అక్కడి ప్రజలు బిజెపి కూటమికి వ్యతిరేకంగా ఉన్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో ఇది స్పష్టం అయ్యింది. రాష్ట్రంలో మొత్తం శాసనసభ స్థానాలు 288. ఏ ఒక్క పార్టీకీ రాష్ట్రవ్యాప్తంగా మద్దతు లేదు. ఒక్కో పార్టీకి ఒక్కో ప్రాంతంలో బలం ఉంది. ఈ ఎన్నికలలో పలు అంశాలు ప్రభావం చూపబోతున్నాయి. మరాఠాలు,ఒబిసిల మధ్య వివాదం, ఉల్లి రైతుల డిమాండ్లు, చెరకు పండించే ప్రాంతాలలో ఆందోళనలు? ఇవన్నీ ఓటర్లపై ప్రభావం చూపే అంశాలే. ఈ ప్రాంతంలో చెరకు తోటలు అధికంగా ఉన్నాయి. అవిభక్త ఎన్‌సిపి, కాంగ్రెస్ పార్టీలకు ఇక్కడ మంచి ఆదరణ ఉంది. ఈ ప్రాంతంలోని ఆరు జిల్లాలలో 70 శాసనసభ స్థానాలు ఉన్నాయి. పశ్చిమ మహారాష్ట్ర రాజకీయాలపై సహకార రంగం ప్రభావం ఎక్కువ. 1960 నుండి మహారాష్ట్రను పాలించిన 20 మంది ముఖ్యమంత్రులలో ఐదుగురు ఈ ప్రాంతం వారే. సీనియర్ నేత శరద్ పవార్‌ది కూడా పశ్చిమ మహారాష్టే. 2014 వరకూ ఇక్కడ కాంగ్రెస్-ఎన్‌సిపి కూటమిదే హవా. గత శాసనసభ ఎన్నికలలో అవిభక్త ఎన్‌సిపి 27, కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా, బిజెపికి 20, శివసేనకు ఐదు స్థానాలు వచ్చాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో ఈ ప్రాంతంలోని మొత్తం 10 స్థానాలలో ఎంవిఎకు 8 సీట్లు లభించాయి.

# భుజాలు తడుముకుంటున్న కెటిఆర్

(మొదటి తరువాయి)

ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని అన్నారు. గురువారం తొర్రూర్ వ్యవసాయ నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార సభలో ఆయన మాట్లాడుతూ.. 'తల తాకట్టు పెట్టయిన డిసెంబర్ లోపు 13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని అన్నారు. 'రుణమాఫీ అయ్యాక నీ తల ఏ టైర్ కింద పెడతావో ఆలోచించుకో' అని అన్నారు. తాను బీఆర్ఎస్‌లో చేరే సమయంలో కేసీఆర్‌ను తండ్రిలా భావించి కాళ్లు మొక్కానని అన్నారు. కానీ తడిగుడ్డతో గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు నాలుగు గోడల మధ్య కాళ్లు పట్టుకొనే అవసరం లేదని అన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు 'పొంగులేటి హోం మంత్రా..? అలా ఎందుకు మాట్లాడుతున్నారు' అని అంటున్నారని, తాను క్యాబినెట్ మంత్రినని, అన్ని విషయాలూ మాట్లాడుతానని అన్నారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానని అంటున్నారని, పాదయాత్ర చేస్తారో.. మోకాళ్ల యాత్ర చేస్తాడో నిర్ణయం ఆయనే తీసుకోవాలని పొంగులేటి ఎద్దేవా చేశారు. తాను ఆ పార్టీ, ఈ పార్టీ నేతలను అరెస్టు చేస్తారని ఎక్కడా చెప్పలేదని తెలిపారు. దానికి శ్రీనివాస్ రెడ్డి అదాని కాళ్లు మొక్కాడని ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. తనకు చట్టం తెలుసునని, ఎప్పుడు, ఎక్కడ ఏం జరగాలో అది జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రజలు మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చారని అన్నారు. గత ప్రభుత్వం 7 లక్షల 19 కోట్ల రూపాయలు అప్పు చేసి ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు..

# నేడు యాదాద్రికి సీఎం రేవంత్

(మొదటి తరువాయి)

వెళ్లనున్నారు. ఉదయం 8:45 గంటలకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు యాదాద్రి అధికారులతో ఆలయ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం మూసి పునరుజ్జీవ ప్రజా చైతన్య పాదయాత్ర ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు వలిగొండ మండలం సంగెం నుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా చైతన్య పాదయాత్ర చేపడుతారు. మూసీ పరివాహక ప్రాంతంలో 6కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే భీమలింగం, ధర్మారెడ్డి కాల్వలను సందర్శించనున్నారు. అనంతరం మూసి పరివాహక ప్రాంత రైతులతో సమావేశం కానున్నారు. రైతుల యోగా క్షేమాలు అడిగి తెలుసుకోనున్నారు. రైతులతో సమావేశం అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఎంపీ చామల కిరణ్ కుమార్, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

# బెంగళూరు చేరుకున్న హైడ్రా బృందం

(మొదటి తరువాయి)

హైడ్రా అధికారులు బుధవారమే బెంగళూరు వెళ్లగా.. రంగనాథ్ గురువారం అక్కడికి చేరుకున్నారు. చెరువుల పనరుద్ధరణతో పాటు విపత్తు నిర్వహణపై వారు అధ్యయనం చేయనున్నారు. హైడ్రా అధికారులు తమ పర్యటనలో యలహంకలోని కర్ణాటక స్టేట్ నేచరల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించనున్నారు. అక్కడి సీనియర్ శాస్త్రవేత్తలతో విపత్తు నిర్వహణపై సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి సెన్సార్స్ సహాయంతో పర్యవేక్షిస్తున్న మురుగునీటి వ్యవస్థను పరిశీలిస్తారు. బెంగళూరు కోర్ సిటీలో ఉన్న చెరువులను సందర్శిస్తారు. రెండో రోజు పర్యటనలో లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌తో రంగనాథ్ సమావేశం కానున్నారు. కర్ణాటక ట్యాంక్ కన్జర్వేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2014పై చర్చించనున్నారు. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని మార్గందోన్హళ్లీ చెరువు, ఇన్ఫోసిస్ సంస్థ అభివృద్ధి చేసిన చెరువులను సందర్శించి అక్కడ అమలు చేసిన ఉత్తమ విధానాలు, సాంకేతికతను తెలుసుకోనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో ఐదు చెరువులను పునరుద్ధరించాలని ఇటీవల ఆదేశించిన నేపథ్యంలో హైడ్రా ఆ దిశగా చర్యలను వేగవంతం చేసింది. కర్ణాటక ప్రభుత్వంతో పాటు సీఎస్ఆర్ కింద కొన్ని కంపెనీలు అభివృద్ధి చేసిన చెరువులను మూడు రోజుల పాటు స్టడీ చేయనున్నారు. తక్కువ ఖర్చుతో కర్ణాటక ప్రభుత్వం బెంగుళూరు లో 35 చెరువులను అభివృద్ధి చేసింది. చెరువుల పరిరక్షణకు, తీసుకుంటున్న చర్యలపై.. హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో పాటు పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పర్యటిస్తున్నారు. పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత సిటీలో మొదటి దశలో నాలుగు చెరువుల ప్రక్షాళనపై ఫోకస్ పెట్టనున్నారు. బాచుపల్లి ఎర్రగుంట చెరువు, మాదాపూర్ సున్నం చెరువు, కూకట్ పల్లి నల్ల చెరువు, రాజేంద్రనగర్ అప్ప చెరువులకు హైడ్రా పునరుజ్జివం తేనుంది. బెంగళూరులో చెరువుల పునరుజ్జీవనంపై క్షేత్ర స్థాయిలో స్థితిగతులను అధ్యయనం చేయడం, మురుగునీరు స్వచ్ఛంగా మార్చడం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో అనుసరించిన విధానాలను పరిశీలించనుంది. అలాగే భారీ వర్షాలు పడినప్పుడల్లా హైదరాబాద్ మహానగరాన్ని వరద నీరు ముంచెత్తడం, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేం దుకు బెంగళూరు డిజాస్టర్ మేనేజ్మెంట్ నిపుణులతో హైడ్రా అధికారులు సమావేశం కానున్నట్లు సమాచారం.


# తెలంగాణలో పలువురు డీఎస్పీల బదిలీ

(మొదటి తరువాయి)

ప్రస్తుతం జగిత్యాల డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న జీ మహేశ్ బాబుని కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ఇక కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా ఉన్న బీ.రామానుజంను కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ఉన్న ఏ.కరుణాకర్‌ను అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా ఉన్న పీ.సదయ్యను బదిలీపై హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని డీజీపీ కోరారు. ప్రస్తుతం వనపర్తి డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న కే.క్రిష్ణ కిశోర్‌ను తొర్రూర్ (మహబుబాబాద్) ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. ఇక తొర్రూర్ ఎస్‌డీపీవోగా ఉన్న వీ సురేశ్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. నిర్మల్ డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న పీ.రవీందర్ రెడ్డిని ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా బదిలీ చేశారు. ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా ఉన్న డీ.ప్రసన్న కుమార్‌ను మెదక్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌పర్ చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు డీజీపీ ఉత్వర్వులు జారీ చేశారు. కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో తక్షణమే రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు.

# కుటుంబ సర్వేను విజయవంతం చేయండి

(మొదటి తరువాయి)



గురువారం ప్రత్యేకాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించారు. ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా కూడా పాల్గొన్న ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ.. ఈ సర్వేకు సంబంధించి ఇంటింటి వివరాలను సేకరించి స్టిక్కరింగ్ చేసే పక్రియ రేపటితో పూర్తవుతుందని, ఈ నెల 9 నుండి అసలు సర్వే మొదలవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు జిల్లా కలెక్టర్లు, సర్వే నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సేకరించిన వివరాలను కంప్యూటరైజ్ చేయడానికి సుశిక్షితులైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దేశంలోనే ప్రథమంగా చేపట్టిన ఈ ఇంటింటి కుటుంబ సర్వే పక్రియని రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఈ సర్వేలో ప్రతీ ఒక్క కుటుంబం పాల్గొనేలా ప్రతీ రోజూ ప్రజలను ఛైతన్యపర్చేలా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఏ ఇంటిని కూడా వదలకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

## సంపాదకీయం

# భారత్‌తో బంధం బలపడేనా ?

అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ మరోమారు ఎన్నిక కావడంతో..ఇప్పుడు మనదేశం కోణంలో చూస్తే సంబంధాలు బలంగానే ఉండే అకాశం ఉంది. ట్రంప్‌తో ప్రధాని మోడీకి మధ్య మంచి మిత్రుత్వం ఉన్న కారణంగా ఆశాజనకంగా ఉంటుందన్న అంచనాలు మొదలయ్యాయి. అయితే ప్రధానంగా హెచ్‌-1 వీసాలు, గ్రీన్ కార్డులు, ఉద్యోగావకాశాలు వంటి వాటిపైనే యువత దృష్టి సారిస్తోంది. నిజానికి ఇప్పుడు ఉద్యోగ భద్రత అన్నది అమెరికాలో లేకుండా పోయింది. ఏ రోజు ఎవరిని ఊడబెరుకుతారో అన్నది సమస్యగా మారింది. ఈ అంశాల్లో మోడీ కూడా ట్రంప్‌తో అమరమరికలు లేకుండా మాట్లాడాలి. అమెరికాకు మళ్లీ స్వర్ణయుగాన్ని తీసుకువస్తానని అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే చెప్పారు. నిజానికి రాజకయాంగా మార్పు జరిగి నప్పుడు ప్రపంచంలో ఏ దేశంలో అయినా కొత్త ఆశలు పుట్టుకుని వస్తాయి. అగ్రరాజ్యం అమెరికాలో కూడా ఇప్పుడు అదే పరిస్థితి ఉంది. ఈ రాజకీయ మార్పు అమెరికాను మళ్లీ గొప్పదిగా చేసేందుకు దోహదం చేయగలిగితే..అది ప్రపంచ దేశాలపైనా ప్రభావంచూపుతుంది. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్లు నిర్వహించిన ప్రచారం అతిపెద్ద రాజకీయ ఉద్యమంగానే చూడాలి. బైడెన్ వయసు మీద పడడంతో సరిగ్గా నిర్ణయాలు తీసుకోలేక పోయారు. అలాగే కమలా హారిస్ కూడా అధ్యక్షుడిని ప్రభావితం చేసి ధృఢమైన నిర్ణయాలకు అడుగువేయలేక పోయారు. ఇది ఓ రకంగా సగటు అమెరికన్లను కలచి వేసిందనే చెప్పాలి. అందుకే గతంలో ఎప్పుడూ లేనంతగా అమెరికా గతంలో ఎన్నడూ చూడని విజయాన్ని ట్రంప్ చేజిక్కించుకున్నారు. అందువల్ల ఈ విజయానికి మరింత ప్రాముఖ్యత ఉంది. అమెరికా ను బలంగా, సురక్షితంగా, సుసంపన్నంగా చేసేవరకు విశ్రమించబోనని కూడా ట్రంప్ ప్రకటించారు. దేశాన్ని తీర్చిదిద్దే ప్రయత్నంలో, తన కర్తవ్య నిర్వహణలో ప్రజలంతా చేతులు కలపాలని కోరుతున్నట్లుగా కూడా ట్రంప్ ప్రకటించారు. అమెరికా చరిత్రలో ఎప్పుడూ లేనంతగా ప్రజలు ఏకపక్షంగా ట్రంప్ విజయానికి దోహదపడ్డారు. భిన్నమైన సంస్కృతులు నేపథ్యాలున్నవారు ఉమ్మడి లక్ష్యాల కోసం ఏకతాటిపైకి రావడం చరిత్రాత్మకం. ప్రజలకిచ్చిన వాగ్దానాలు పూర్తిచేయడంలో ఏ శక్తీ తనను ఆపజాలదని ట్రంప్ కూడా ధృడంగానే ఉన్నారు. అసలైన అమెరికన్లకు దేశంలో ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోతున్నాయనీ, అమెరికా ఉత్పత్తుల అమ్మకాలకు అన్నిచోట్ల అడ్డంకులు ఎదురవుతున్నాయన్నదే ట్రంప్ నినాదం. తొలిసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు కూడా ఆయన ఇదే అభిప్రాయంతో ఉన్నారు. ట్రంప్ పదేపదే చెబుతు న్నట్లుగా.. అమెరికా ఎదుర్కొంటున్న ఈ సమస్యకు కారణం నాలుగు దశాబ్దాలుగా ఆ దేశ పాలకులు అనుసరించిన విధానాలేనని చెప్పవచ్చు. అలాగని అమెరికా మీద ఆధారపడ్డ ఇతర దేశాల వారిని చులకన చేయడం కూడా మంచిది కాదు. అన్ని దేశాల ఆర్థిక విధానాలను నయానా భయాన సరళీకరించి విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచేలా చేసింది అమెరికా విధానకర్తలే. 1990ల నుంచి బాగా ఊపందుకున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక దశ దాటిన తర్వాత అవసరమైన స్థాయిలో అమెరికన్ యువతకు ఉద్యోగాలను సృష్టించలేదు. ఈ రంగంలో కూడా చౌకగా లభ్యమయ్యే ఆసియా నిపుణులే ఎక్కువగా లబ్ది పొందారు. ఇటీవల వచ్చిన కృత్రిమ మేధో సాంకేతిక పరిజ్ఞానం కూడా ఊడిపోయే ఉద్యోగాలతో పోల్చితే సృష్టి అయ్యే ఉద్యోగాల సంఖ్య తక్కువే. కోవిడ్ అనంతరం ఐటీ రంగంలో హేమాహేమీలు అనదగిన కంపెనీలు కూడా పోటీలు పడి ఉద్యోగులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ ప్రధానంగా మధ్యతరగతి శ్వేత జాతీయులను ఆకర్షించడమే లక్ష్యంగా చేసుకుని రాజకీయాలను మొదలుపెట్టారు. మొదటిదఫా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడేనాటికే ఆ దిశలో అడుగులు వేసి విజయం సాధించారు. శ్వేతజాతి మధ్యతరగతికి ఉద్యోగ అవకాశాలు దక్కకపోవటానికి విదేశాలే కారణమని దుమ్మెత్తిపోశారు. తన ఉత్పత్తులతో అమెరికా మార్కెట్‌ను ముంచెత్తిన చైనాతో మొదలుపెట్టిన రాజకీయయుద్ధంలో అవసరమను కున్న చోట భారత్‌నీ లాగారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ విపరీతంగా దిగుమతి సుంకాలు విధిస్తోందని విరుచుకుపడ్డారు. తాజా ఎన్నికల్లో అయితే మంచి జీతాలుండే ఉద్యోగాలన్నిటినీ భారతీయులు కొట్టేస్తున్నారనీ ఆక్షేపించారు. వివిధ రంగాల్లో అమెరికా ఆధిపత్యం తగ్గటానికి, ఉద్యోగాల క్షీణతకు ఇతర దేశాల చర్యలే కారణమన్నట్లుగా ఆయన చేసిన ప్రచారానికి లక్ష్యం శ్వేత జాతీయులను ఆకర్షించడమే. అమెరికా జనాభాలో 60 శాతానికి కాస్త అటుఇటుగా ఉన్న శ్వేతజాతీయులను తనవైపు తిప్పుకోవటంలో మొదటిసారిలాగే రెండోసారి ట్రంప్ విజయం సాధించారు. శ్వేతజాతీయుల ఆధిపత్యానికి ముప్పు ముంచు కొస్తుందనే ఒకరకమైన భయాన్ని, ఆందోళనను కలిగించటంలో ట్రంప్ సఫలీకృతమయ్యారు. ఉద్యోగ భద్రతను, ఉద్యోగ కల్పనను తగినంత ఇవ్వలేని ఆర్థిక వ్యవస్థ అభద్రతా సమాజాన్ని సృష్టిస్తుంది. కాలం గడుస్తున్న కొద్దీ రాజకీయ నాయకుల్లో మార్పుని చూడటం సహజం. కానీ ట్రంప్‌ని నిశితంగా చూసిన వారెవరూ ఆయన ఆలోచనల్లో మార్పు వచ్చిందని భావించటం లేదు. నియంతలే కాకుండా, ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా అధికారం చేపట్టి నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తున్న నేతలు ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టటాన్ని తమకు సానుకూలంగా భావిస్తున్నారు. రష్యా అధినేత పుతిన్ కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంది. రష్యా పెట్టే షరతులకు ఉక్రెయిన్ అంగీకరించేలా చేసి యుద్ధాన్ని విరమింపచేస్తానని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించారు. ఇజ్రాయెల్ నేత నెతన్యాహుకు కూడా ట్రంప్ పట్ల వ్యతిరేకత ఉందని చెప్పలేం. హమాస్ నిర్మూలన పేరుతో గాజాలో సాగుతున్న నరమేధాన్ని ఆపేలా ట్రంప్ తనపై ఒత్తిడి తెస్తారని ఇజ్రాయెల్ పాలకవర్గాలూ భావించటం లేదు. వీటన్నిటికంటే ముఖ్యమైంది వాతావరణ మార్పులపై కార్యాచరణ. అసలు వాతావరణ మార్పులే ప్రమాదకరంగా లేవనీ ప్రమాదకరమని ప్రచారం చేసే వాళ్లవి డొల్ల వాదనేనని ట్రంప్ అనేకసార్లు ఈసడించారు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లు తాను గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ప్రకటించారు. పాత వైఖరికే కట్టుబడి ట్రంప్ వ్యవహరిస్తే ప్రపంచానికి వాతావరణపరంగా గడ్డుకాలం తప్పదనే అనుకోవాలి. మొత్తంగా భారత్‌తో ఉన్న సంబంధాల విషయంలో పెద్దగా కఠిన వైఖరిని ప్రదర్శించే అవకాశం ఉండకపోవచ్చు.


# కార్మికవర్గాన్ని పోరుబాటకు నెట్టే ట్రంప్ గెలుపు!



అమెరికా 47వ అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ గెలిచాడు. గురువారం రాత్రి వరకు 87శాతం ఓట్ల లెక్కింపు జరిగే సమయానికి 538 ఎలక్ట్రరల్ ఓట్ల కాలేజీ స్థానాలలో ట్రంప్ 295 చోట్ల, కమలాహారిస్ 226 చోట్ల గెలుపు లేదా ఆధిక్యంలో ఉన్నట్లు తేలింది. ట్రంప్ గెలుపు ఖాయంగా మారినప్పటికీ లెక్కింపు ఇంకా పూర్తి కాలేదు. అందువలన ఎన్నికల ఫలితాల గురించి ఎవరు చెప్పినా ప్రాథమిక పరిశీలన మాత్రమే. పూర్తి సమీక్షకు ఇంకా వ్యవధి పడుతుంది. గెలిచిన వారిని వీరులు శూరులు అని పొగడటం మీడియాలో సహజంగా జరిగేదే ! ఇప్పుడూ అదే జరుగుతోంది. ఇప్పటి వరకు వెల్లడైన వివరాలను బట్టి ప్రధాన అభ్యర్థులిద్దరికీ గత ఎన్నికల కంటే ఓట్లు తగ్గాయి. ట్రంప్‌కు ఇరవై లక్షలు, కమలకు కోటీ 30 నుంచి నలభై లక్షల వరకు తగ్గుతాయని అంచనా. దీన్ని బట్టి డెమోక్రటిక్ పార్టీ ఓడిందో రిపబ్లికన్ పార్టీ గెలిచిందో ఎవరికి వారు అర్థం చేసుకోవచ్చు.గత ఎన్నికల్లో జోబైడెన్‌కు 8.128కోట్ల ఓట్లు రాగా ట్రంప్‌కు 7.422 కోట్లు వచ్చాయి. ఈసారి 87శాతం లెక్కింపు పూర్తయ్యే సమయానికి ట్రంప్‌కు 7.26 కోట్లు, కమలకు 6.79కోట్ల ఓట్లు వచ్చాయి. దీన్ని బట్టి డెమోక్రటిక్ పార్టీ పట్ల ఓటర్లు ఎంతగా అనాసక్తితో ఉన్నారో స్పష్టమైంది. ఇదే ట్రంప్ గెలిచేందుకు తోడ్పడింది తప్ప మరొకటి కాదు. రెండు పార్టీల తరఫున కార్పొరేట్ శక్తులు తారసిల్లాయి. ప్రపంచంలో అత్యంత ధనవంతుడైన ఎలన్ మస్క్, అతగాడి పూర్వపు ట్విటర్ ప్రస్తుత 'ఎక్స్' సామాజిక మాధ్యమం ట్రంప్ గెలుపులో ఒక ప్రధాన పాత్ర పోషించటాన్ని చూసిన వారు ఇద్దరు కార్పొరేట్‌లు ఈ ఎన్నికల్లో గెలిచినట్లు వ్యాఖ్యానించటం సబబే. ట్రంప్‌ను ఎందుకు ఓడించాలో డెమోక్రాట్లు గట్టిగా చెప్పారు తప్ప తమను ఎందుకు గెలిపించాలో ఓటర్లకు నచ్చచెప్పలేకపోయారని కొందరు చెబుతున్నారు. ఈ కారణంగానే సానుకూలంగా ఉన్నవారు కూడా ఓటింగ్‌కు రాలేదని చెప్పవచ్చు.2018 తరువాత జరిగిన అన్ని జాతీయ ఎన్నికలలో ట్రంప్ ముందుకు తెచ్చిన అజెండాకు వ్యతిరేకంగా ఓటు చేసిన అమెరికన్లు ఇప్పుడు నిరాసక్తత వ్యక్తం చేయటం ఒక విధంగా ఆందోళన కలిగించే పరిణామమే. జోబైడెన్ విఫల విధానాలు, కార్మిక వర్గాన్ని వదిలి కార్పొరేట్లు, ముఖ్యంగా ఆయుధ కంపెనీల యజమానుల సేవలో తరించటం, ఈ ఎన్నికల్లో కూడా ట్రంప్‌తో పోటీ పడి తాము కూడా పన్నురేటు తగ్గిస్తామని చెప్పటం వంటి అనేక అంశాలు డెమోక్రాట్ల మద్దతుదార్లను నిరాశకు గురి చేశాయి. అమెరికాలో పన్ను రేటు తగ్గించటం అంటే కార్పొరేట్లకు దోచిపెట్టడం, ఆ మేరకు కార్మికవర్గానికి సామాజిక భద్రతా పథకాలకు కోత పెట్టటం లేదా భారాలు మోపటం తప్ప మరొకటి కాదు. గత నాలుగేండ్లలో నిజవేతన పెరుగుదల స్తంభన లేదా తిరోగమనం, ధరల పెరుగుదలతో జనం సతమతమౌతున్నారు. ఈ అసంతృప్తిని ట్రంప్ తన వాగాడంబరంతో సొమ్ము చేసుకున్నాడు. అమెరికన్లు యుద్ధాల పట్ల విసిగి ఉన్నారు. అందుకే తనకు అధికారమిస్తే యుద్ధాలను అపుతానని ట్రంప్ చెప్పాడు.సాంప్రదాయకంగా డెమోక్రాట్లకు ఓటు వేసే అరబ్బు జాతీయులు ఈసారి ట్రంప్‌కు వేశారన్న వార్తలు వచ్చాయి. పాలస్తీనాలోని గాజా, పశ్చిమగట్టు, లెబనాన్, ఎమెన్, ఇరాన్‌పై దాడులు చేస్తున్న ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని జోబైడెన్ నిస్సి గ్గగా బలపరచటమే గాక ఆయుధాలు, నిధులు కూడా పెద్ద ఎత్తున అందచేస్తున్న పూర్వరంగంలో ట్రంప్ మీద ఇష్టం ఉన్నా లేకున్నా జోబైడెన్ మీద వ్యతిరేకతతో ఓట్లు వేసినట్లు చెప్పవచ్చు. నిజానికి ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఇజ్రాయిల్ దుర్మార్గాలకు మద్దతు, పలుచోట్ల ఉద్రిక్తతలను రెచ్చగొట్టటం యుద్ధాలకు మద్దతివ్వటం తప్ప వ్యతిరేకించిన దాఖలాలు లేవు. లాటినోలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారని, వర్ణ వివక్షకు గురయ్యే ఆఫ్రో-అమెరికన్లు కూడా కొందరు ట్రంప్‌కు ఓటువేశారని,అబార్షన్లను వ్యతిరేకించే రిపబ్లికన్లకు మహిళలు ఎందుకు ఓట్లు వేశారన్నది పరిశీలించాల్సి ఉంది.

గతంలో ట్రంప్ అమెరికా కార్పొరేట్లకు అనుకూలంగా చైనాతో వాణిజ్య యుద్ధానికి తెరతీశాడు.దాన్ని బైడెన్ కొనసాగించాడు. ఇప్పుడు ట్రంప్ మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశాలే ఉన్నాయి.నరేంద్రమోడీకి ట్రంప్ స్నేహితుడు గనుక మనదేశానికి ఒరగబెడతాడని కొందరు చెబుతున్నారు. గతంలో అలాంటి ఆచరణ లేదు. అంతర్గతంగా ప్రాజెక్టు 2025పేరుతో రూపొందించిన కార్పొరేట్ అజెండాను అమలు చేయించేందుకే డాలర్ల మూటలతో ట్రంప్ వెనుక వారంతా నిలిచారన్నది స్పష్టం. దాని అమలుకు పూనుకుంటే మరోసారి అమెరికాలో వాటికి వ్యతిరేకంగా కార్మికవర్గం వీధుల్లోకి రావటం అనివార్యం. అది ఏ రూపంలో ఉంటుందన్నది జనవరిలో ట్రంప్ ముందుకు తెచ్చే అజెండాను బట్టి ఉంటుంది. డెమోక్రాట్ల మీద అసంతృప్తితో ఓటింగ్‌కు రాని కార్మికవర్గం ట్రంప్ దాడిని చూస్తూ ఊరుకోదు

# అది వారి హక్కే



ఉత్తరప్రదేశ్‌లోని మదర్సాలలో చదువుకునే 17లక్షలమంది విద్యార్థులకు భారీ ఊరట లభించింది. ఆ రాష్ట్రంలో ఏర్పాటైన 16 వేలకుపైగా మదర్సాలు చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు మంగళవారం తేల్చిచెప్పింది. ఈ పాఠశాలలు లౌకికవాద సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. చట్టం రూప కల్పనలో లోపాలున్నాయని నిరూపించినప్పుడు, ప్రాథమిక హక్కులకు, రాజ్యాంగ నిబంధనలకు భంగం కలిగినట్టు నిర్ధారించినప్పుడు మాత్రమే ఆ చట్టాన్ని రద్దు చేయగలరని తెలిపింది. యూపీ ప్రభుత్వం 2004లో ముస్లిం మైనారిటీ విద్యాసంస్థలను నియంత్రిస్తూ మదర్సా విద్యామండలి చట్టాన్ని తీసుకొచ్చింది. రాజ్యాంగంలోని 25వ ప్రవేశికకు అనుగుణంగానే ఈచట్టం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భాష, మతపరమైన అల్పసంఖ్యాక వర్గాల ప్రజలు విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకుని, నిర్వహించుకునే హక్కును రాజ్యాంగం కల్పించిందన్న విషయాన్ని సైతం న్యాయస్థానం గుర్తుచేసింది. అయితే, మదర్సా విద్యాసంస్థలు జారీచేసే 'ఫాజిల్ (డిగ్రీతో సమానం)', 'కామిల్ (పీజీతో సమానం)' స్థాయి పట్టాలపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. యూజీసీ నిబంధనలకు ఇది విరుద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఉత్తరప్రదేశ్ తరపున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ కెఎం నటరాజ్ "మదర్సాల్లో బోధనా కోర్సుల్లో గణితం, సైన్స్, సామాజికశాస్త్రం వంటి సబ్జెక్టుల ప్రమేయం వుండదని, సెక్యులర్ సబ్జెక్టులను చదవడమనేది పూర్తిగా మన ఇష్టం" అని లాజిక్‌ను తీసుకువచ్చారు. ఆ లాజిక్‌ను తిప్పికొడుతూ సర్వోన్నత న్యాయస్థానం "మదర్సాలా బోర్డు చట్టాన్ని కొట్టివేయడంలో పరిష్కారం లేదు. మదర్సాల్లో చదువుకునే విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం ఇతర విద్యాసంస్థల్లో అందచేసే నాణ్యత కలిగిన విద్యను పొందేలా చూసేందుకు తగిన ఆదేశాలు జారీచేయాలి" అని వ్యాఖ్యానించింది. మదర్సాల్లో చదివే వారితో సహా మొత్తంగా విద్యార్థులందరి పట్ల 'చట్టబద్ధమైన ప్రభుత్వ ప్రయోజనం' రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నట్లయితే, జీవితంలో వారు మంచి స్థానాల్లో నెలకొనేలా నాణ్యతా ప్రమాణాలు కలిగిన విద్యను అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని కూడా స్పష్టం చేసింది సర్వోన్నత న్యాయస్థానం. ముస్లింలు విద్యాసంస్థలు నిర్వహిస్తే దాన్ని అనుమాన దృష్టితో చూడటం అలవాటైన రోజుల్లో సుప్రీంకోర్టు తాజా తీర్పు మతోన్మాదులకు ఒక చెంపపెట్టు. మదర్సాలలో విద్యాభ్యాసం చేసే వారు ఒక ఉత్తరప్రదేశ్‌లోనే కాదు దేశమంతటా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మదర్సాలు ప్రముఖమైన పాత్ర పోషించిన వాస్తవాన్ని విస్మరించకూడదు. వీటిలో చదువుకున్న అనేక మంది నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. స్వాతంత్ర్యం తర్వాత మదర్సాలు చట్టబద్ధంగానే ఏర్పాటయ్యాయి. వీటి నిర్వహణ రహస్య వ్యవహారం ఏమీకాదు. తొలినుంచి వీటిని వ్యతిరేకించే బీజేపీ తాను అధికారంలోకి వచ్చింది మొదలు తమ విద్వేష రాజకీయాల్లో వీటిని భాగం చేశాయి. మదర్సాలలో కేవలం ఇస్లాం మత బోధనలే కొనసాగడం లేదు. దానితో పాటు హిందీ, ఇంగ్లీషు లాంటి భాషలు, కంప్యూటర్ విద్య లాంటివీ ఉంటాయి. అలహాబాద్ హైకోర్టు తీర్పు తర్వాత ఈ విద్యాలయాల్లోని ఉపాధ్యాయులను, విద్యార్థులను మామూలు విద్యాలయాల్లో చేర్పించాలను కున్నారు. దానికి అనేక శక్తులు ఎన్నో అవాంతరాలు కలిగించాయి. ఆ విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకం చేశాయి. ఒక మతంవారు ప్రత్యేకంగా విద్యాలయాలు నడపకూడదని వాదించడం ప్రారంభిస్తే అది క్రమంగా ఇతర మతాలు నడిపే విద్యాలయాలకు కూడా వర్తింపచేసే ప్రమాదముంది. హిందూ సంస్థలు కూడా పాఠశాలలను నడుపుతున్నాయి. ఆరెస్సెస్ సరస్వతీ శిశు విద్యామందిరాల లాంటివి నడుపుతూనే ఉన్నాయి. అందులో చేయించే ప్రార్థనలూ సైతం భిన్నంగానే ఉంటాయి. కాని దీన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోరు. అదే మదర్సాల దగ్గర కొచ్చేసరికి బోలెడు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంటారు. మదర్సా విద్యను మరింత మెరుగు పరచవలసిన అవసరం ఉండొచ్చు. ఆపని చేయడానికి రాష్ట్రాల ప్రభుత్వాలు ఆ మతానికి చెందిన ప్రతినిధులతో చర్చించి సముచిత నిర్ణయం తీసుకోవచ్చు. ఒక మతంవారు, ముఖ్యంగా విద్యాలయాలను నెలకొల్పితే వక్ర దృష్టితో చూడవలసిన అగత్యమేమి లేదు. ఎవరికి నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను జాతి, మతాలతో నిమిత్తం లేకుండా రాజ్యాంగం అందరికీ కల్పించింది. అదే సమయంలో మతం మారే హక్కునే కాదు%ౌ% ఏమతాన్ని అనుసరించకుండా ఉండే హక్కును సైతం ఇచ్చింది. అలాంటప్పుడు ఒక మతాన్నే వెలేసినట్టు చూడటమే నిజానికి రాజ్యాంగ విరుద్ధం.

## ఆన్ జాబ్ ట్రైనింగ్ సెంటర్ను ఆకస్మిక తనిఖీ చేసిన వనపర్తి డిఐఇఓ



వనపర్తి నవంబర్ 7 (పజా స్వేచ్ఛ

ఆన్ జాబ్ ట్రైనింగ్ (ఓజేటీ) అనేది ఇంటర్మీడియట్ వొకేషనల్ కోర్సులకు వెన్నెముక లాంటిదని వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు ఇది అనేక ప్రయోజనాలను అందిస్తుందని వనపర్తి DIEO ఎర్ర అంజయ్య అన్నారు. గురువారం ఓ జే టి కి హాజరైన వనపర్తి లోని సాయిరత్న,రక్ష ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఓ జే టి కి హాజరై విధిగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు

# ఇంటింటి సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి పిలుపు

నార్సింగ్, నవంబర్ 7 పజా స్వేచ్ఛ

నార్సింగ్ మున్సిపాలిటీ కోకాపేటలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణను కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా, కలెక్టర్ అక్కడ సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో సేకరించిన వివరాలు పరిశీలించి, సర్వే పూర్తి చేసిన ఇంటికి అతికించిన స్టిక్కర్లను పరిశీలించారు. స్టిక్కర్ పై ఇంటి నంబరు, ఎన్యూమరేషన్ బ్లాక్, క్రమ సంఖ్య తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ ఎన్యూమరేటర్లకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన అన్నారు, “ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు



తమవంతు సహకారం అందించాలి.” ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు వాస్తవ సమాచారాన్ని అందించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సర్వే పకడ్బందీగా జరగాలని అధికారులను ఆదేశించారు.

# యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీకి రక్తదానం

- అరుదుగా దొరికే O-ve బ్లడ్ డొనేట్ చేసిన శ్రీకాంత్

వనపర్తి నవంబర్ 7 పజా స్వేచ్ఛ

వనపర్తి జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ హిస్పిటల్లో శారద అనే డెలివరీ స్త్రీకి రక్తహీనత సమస్య వల్ల O-ve బ్లడ్ ఉంటేనే ఆపరేషన్ చేస్తాము లేదంటే పేసెంట్ ను హైదరాబాద్ గాంధీ హాస్పటల్ కి పంపిస్తాము అని డాక్టర్స్ నిర్ణయించడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో బ్లడ్ దొరకక పోవడం వల్ల కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ కాగితాల మధును ఆశ్రయించడంతో వెంటనే స్పందించి వనపర్తి



జిల్లా ప్రాంతానికి చెందిన శ్రీకాంత్ తో వనపర్తి జిల్లా న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్ లో బ్లడ్ డొనేషన్ చేపించడం జరిగింది. యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ డెలివరీ, తలసేమియా, డయాలసిస్, క్యాన్సర్ మరియు ఆపరేషన్ కోసం ఉమ్మడి పాలమూరు జిల్లాలో బ్లడ్ దొరకడం చాలా ఇబంది ఉంది కాబట్టి యువకులు మీ యొక్క బ్లడ్ గ్రూప్ తెలుసుకొని ఎవరికైన బ్లడ్ అవసరం ఉన్నపుడు ఒక నిండు ప్రాణం కాపాడటానికి ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గోబుర్ నవీన్,యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు, ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వగ్గం ప్రేమ్ కుమార్, శ్రీకాంత్,యశ్విన్, నరేష్ పాల్గొన్నారు.

## ఎట్టకేలకు మండల పరిషత్ కార్యాలయ పరిధిలో జంగిల్ క్లియరెన్స్

ఆమనగలు నవంబర్,7 పజా స్వేచ్ఛ





ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ సముదాయంలో పిచ్చి మొక్కలు పెరిగి అన్ని కార్యాలయాల్లో ముందు చెత్త పేరుకుపోయి ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది, అదే కార్యాలయాన్ని అనుసరించి ఉన్న భవిత విద్యా కేంద్రంలోని విద్యార్థులకు కూడా తీవ్రమైన అసౌకర్యాన్ని కల్పించడమే కాక పాములు కూడా తిరుగుతున్నాయి అనే వార్తలు కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఆమనగల్లు మండల ఎంపీడీవో కుసుమ మాధురి, విద్యాధికారి పాండు ప్రత్యేక శ్రద్ధ చూపించి మున్సిపల్ కార్యాలయం వారితో సమన్వయం చేసుకొని ఇక్కడ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి కార్యాలయ ప్రాంగణాలను తిరిగి ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం పూర్తవ్వగానే భవిత విద్యా కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో, ఎంఈవో విద్యార్థులతో ముచ్చటించి వారిని ఉత్సాహపరిచారు. ఎంపీడీవో, ఎంఈవో సమగ్ర కుటుంబ సర్వేలో తలమునకలై ఉన్నా జంగిల్ క్లియరెన్స్ చేయించి అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారిని ఉత్తేజ పరచడాన్ని ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# రోడ్లను కళ్ళాలుగా మార్చి వాహనదారుల ప్రాణాలు తీయొద్దు

-వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ రావు

వనపర్తి నవంబర్ 7 పజా స్వేచ్ఛ

రోడ్లపై ధాన్యాన్ని పోసి ఉంచి నల్ల కవర్ కప్పడం వల్ల ధాన్యం కుప్పలు కనపడక ధాన్యము కుప్పకు ఢీకొని చనిపోయిన సంఘటనలు చాలా చోటు చేసుకున్నాయనీ, జిల్లాలో జరిగి రోడ్డు ప్రమాదాల నివారణ గురించి రోడ్లపై ధాన్యాన్ని పోయవద్దని, ప్రమాదాలకు కారణం కావద్దని రైతులను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కోరారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ధాన్యం పోసి కల్లాలుగా మార్చడం వల్ల వాహనదారులు రాత్రి సమయాలలో గమనించక ప్రమాదాలు జరిగి చనిపోతున్నారనీ, బావుల దగ్గర, ఇండ్ల వద్ద ,లేదా సొంత పొలాల్లో,






ఇతర ప్రదేశాలలో ధాన్యం పోయడానికి ప్రత్యేకంగా కళ్ళాలను ఏర్పాటు చేసుకోవాలనీ విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి వాహన దారులకు ఇబ్బంది కలిగించి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దని రైతులను కోరారు. రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని వాహనదారులు వాటిని ఢీకొని చనిపోవడం జరుగుతుందన్నారు. రోడ్లపై ధాన్యం పోయవద్దని పోలీస్ అధికారులు సిబ్బంది కూడా రైతులకు విధిగా అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా పోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని , అందుకు రైతులు, ప్రజలు సహకరించాలని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.

# బండారు బాలయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం


-కాంగ్రెస్ నాయకుడు దాడి యోగానంద రెడ్డి



వనపర్తి నవంబర్ 7 పజా స్వేచ్ఛ

గతనెల,30వ తేదిన,పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో,రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మరణించిన,తాటిపాముల గ్రామానికి చెందిన బండారు బాలయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దాడి యోగానంద రెడ్డి అన్నారు. గురువారం ఆయన దశదిన కార్యక్రమంకి హాజరై బాలయ్య చిత్రపటానికి నివాళ్లు అర్పించి,బాలయ్య భార్య పెంటమ్మ కు తక్షణ సహాయంగా 3000 ఆర్థిక సహాయం చేశారు.బాలయ్య కుటుంబానికి మునుముందు ఎల్లవేళలా అండగా ఉంటామని,ఆయన కుమారుడు నరేష్,కూతురుకు,ధైర్యం చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో,కాంగ్రెస్ పార్టీ నాయకులు,బండారు రంజిత్,గంధం విష్ణు,బండారు నాగయ్య,బండారు నాగముని,బండారు యమదుగ్గి,బండారు బాలస్వామి,సుబ్రమణ్యం,బండారు సురేష్,అంజి తదితరులు ఆయన వెంట ఉన్నారు ఉన్నారు.

## నెక్కొండ పోలీస్ స్టేషనను తనిఖీ చేసిన డీసీపీ



పజా స్వేచ్ఛ /నర్సంపేట ఆర్సీ

వరంగల్ జిల్లా నెక్కొండ పోలీస్ స్టేషన్ ను వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని పలు రికార్డులను పరిశీలించారు.అనంతరం ఫిర్యాదులను పరిశీలించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కేసులు పెండింగ్ లో లేకుండా చూడాలని సూచించారు.ఈ తనిఖీల్లో ఎస్సై మహేందర్,సిబ్బంది తదితరులు ఉన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన

మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి



పజా స్వేచ్ఛ /నర్సంపేట ఆర్సీ :-

నర్సంపేట నియోజకవర్గం బుధరావుపేట గ్రామానికీ చెందిన బత్తిని శ్రీనివాస్-హేమలత దంపతుల పుత్రిక శ్రీవల్లీ ఆదిత్య ల నూతన వస్త్ర,ఫలపుష్కలంకరణ ఒడినింపుట వేడుకకు మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మండల పార్టీ అద్యక్షులు,పి ఏ సి ఎస్ డైరెక్టర్,మాజీ సర్పంచ్ లు,మాజీ ఎంపీటీసీలు పార్టి ముఖ్య నాయకులు పాల్గోన్నారు.

## ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో సీఎం రిలీఫ్ చెక్కు పంపిణీ

పజా స్వేచ్ఛ మిర్యాలగూడ ప్రతినిధి

మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో 42వ వార్డుకు చెందిన జలనీల నాగమణి(21000) మరియు చిలుకూరి భవాని(26000) సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, నల్గొండ డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, 42వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సోమగాని శ్రీనివాస్ పంపిణీ కార్యక్రమంలో బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## బిజినెస్

# ట్రంప్ గెలుపుతో.. దిగొచ్చిన బంగారం ధరలు



గత కొన్ని రోజులుగా పరుగులు పెడుతున్న బంగారం ధరలకు బ్రేక్ పడింది  అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్  గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో ఫారెక్స్ మార్కెట్లో యూఎస్ డాలర్ పుంజుకుంది. డాలర్ విలువ పెరగడంతో.. రూపాయి విలువ తగ్గింది. ఫలితంగా పుత్తడి ధరలు కూడా దిగివచ్చాయి.గత రెండు రోజుల్లో పది గ్రాముల బంగారం ధర రూ.2,100 తగ్గింది. అదే సమయంలో వెండి ధర కిలోకు రూ.4,050 తగ్గింది. గురువారం నాటికి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్  లో డిసెంబర్ డెలివరీ గోల్డ్ కాంట్రాక్ట్స్ 0.37 శాతం క్షీణతతో 10 గ్రాముల బంగారం ధర రూ.76,369 వద్ద ప్రారంభమైంది. వెండి డిసెంబర్ ఫ్యూచర్ కాంట్రాక్ట్‌లు 0.24 శాతం తగ్గి రూ.90,601కి చేరింది. బుధవారం నాడు ఇంట్రాడే ట్రేడింగ్‌లో కిలో వెండి ధర రూ.3,158 వరకూ పతనమై 91,490 వద్ద నిలిచిన విషయం తెలిసిందే ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ లిమిటెడ్  ప్రకారం.. దేశంలో 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 76,570గా ఉంది. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.74,720గా, 20 క్యారెట్ల తులం బంగారం ధర రూ.68,130, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.62,201గా ఉంది. గుడ్‌రిటర్న్స్ డేటా ప్రకారం.. గురువారం దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,790 తగ్గి రూ.78,710కి చేరింది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,650 తగ్గి రూ.72,150 వద్ద కొనసాగుతోంది.

## స్విగ్గీ ఐపీఓకు బిడ్లు నామమాత్రమే..




ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ మేజర్ స్విగ్గీ ఐపీఓకు తొలిరోజు ఇన్వెస్టర్ల నుంచి స్పందన అంతంత మాత్రంగానే వచ్చింది. బుధవారం 12 శాతం షేర్లు మాత్రమే సబ్ స్క్రిప్షన్ అయ్యాయి. 16,01,09,703 షేర్లకు గాను 1,89,80,620 షేర్లకు మాత్రమే బిడ్లు దాఖలయ్యాయని ఎన్ఎస్ఈ డేటా చెబుతోంది. ఇక రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 54 శాతం సబ్ స్క్రిప్షన్ లభించగా, నాన్ ఇన్ స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు ఆరు శాతం మంది మాత్రమే బిడ్లు ఫైల్ చేశారు. యాంకర్ ఇన్వెస్టర్ల ద్వారా మంగళవారం రూ.5,085 కోట్ల నిధులు సేకరించినట్లు మంగళవారం తెలిపింది.నవంబర్ ఆరో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకూ స్విగ్గీ ఐపీఓ సబ్ స్క్రిప్షన్ నడుస్తుంది. ఐపీఓలో స్విగ్గీ షేర్ ధర రూ.371 నుంచి రూ.390 మధ్య ప్రతిపాదించింది. ఐపీఓ ద్వారా రూ.11,327 కోట్ల నిధులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది స్విగ్గీ. ఇందులో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.6,828 కోట్లు, తాజా షేర్ల జారీ ద్వారా రూ.4,499 కోట్ల నిధులు సేకరించనున్నది. తాజాగా సేకరించిన నిధులను టెక్నాలజీ, క్లౌడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, బ్రాండ్ మార్కెటింగ్, బిజినెస్ ప్రమోషన్, డెట్ పేమెంట్ కోసం ఖర్చు చేస్తామని ఇప్పటికే స్విగ్గీ వెల్లడించింది.

## మార్కెట్లోకి స్కోడా కైలాక్

**-ధర రూ.7.89 లక్షలు**



చెక్ రిపబ్లిక్‌నకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం స్కోడా ఆటో..దేశీయ మార్కెట్లోకి తొలిసారిగా నాలుగు మీటర్ల లోపు పొడువు కలిగిన కాంప్యాక్ట్ ఎస్‌యూవీ మాడల్ కైలాక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ధర రూ.7.89 లక్షలుగా నిర్ణయించింది. ఈ నూతన మాడల్ కోసం డిసెంబర్ 2 నుంచి బుకింగ్‌లు ప్రారంభించనున్న సంస్థ..బుకింగ్ చేసుకున్నవారికి వచ్చే ఏడాది జనవరి 27 నుంచి డెలివరీ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా స్కోడా ఆటో సీఈవో క్లాస్ జెల్మార్ మాట్లాడుతూ..ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెటైన భారత్‌లో మరింత పాగా వేయడానికి ఈ నూతన మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, అలాగే రెండేండ్లలో 10 వేల యూనిట్ల వార్షిక విక్రయాలు లక్ష్యం చేరుకోవడానికి వీలుపడనున్నదన్నారు. దేశీయంగా అమ్ముడవుతున్న వాహనాల్లో ఎస్‌యూవీల వాటా 50 శాతానికి పైగా ఉంటుంది.

## గల్ఫ్ ఆయిల్ లాభం 84 కోట్లు




**హైదరాబాద్,**

హిందుజా గ్రూపునకు చెందిన గల్ఫ్ ఆయిల్ లుబ్రికెంట్స్ ఇండియా ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూ డు నెలల కాలానికిగాను సంస్థ రూ.84.44 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.73.66 కోట్ల లాభంతో పోలిస్తే 15 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 5.86 శాతం ఎగబాకి రూ.802.30 కోట్ల నుంచి రూ.849.33 కోట్లకు చేరుకున్నది.

# 22వ ర్యాంక్‌కు విరాట్ కోహ్లీ

**-పదేండ్లలో ఇదే ప్రథమం**

**దుబాయ్**

రన్‌మిషీన్ విరాట్ కోహ్లీ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్(బ్యాటింగ్)లో మరింత దిగజారాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో ముగిసిన మూడు టెస్టుల సిరీస్‌లో ఆరు ఇన్నింగ్స్‌లలో కలిపి 93 పరుగులే చేసిన విరాట్.. ఐసీసీ బుధవారం విడుదల చేసిన టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో 8 స్థానాలు దిగజారి 22వ స్థానానికి పడిపోయాడు. 2014 ఇంగ్లండ్ సిరీస్ వైఫల్యం తర్వాత (నాడు 24వ స్థానం) కోహ్లీ ర్యాంకు



ఈ స్థాయిలో పడిపోవడం ఇదే ప్రథమం.టీమ్ ఇండియా సారథి రోహిత్ శర్మ కూడా 2 స్థానాలు దిగజారి 26వ స్థానంలో ఉన్నాడు. యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ 5 స్థానాలు మెరుగుపరుచుకుని 6వ స్థానంలో నిలిచి మరోసారి టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. ఈ జాబితాలో జో రూట్, కేన్ విలియమ్సన్ తొలి రెండు ర్యాంక్‌ల్లో ఉండగా యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఒక ర్యాంక్ దిగజారి 4వ ర్యాంకుతో సరిపెట్టుకున్నాడు. బౌలర్ల జాబితాలో రబాడా అగ్రస్థానంలో కొనసాగుతుండగా హెజిల్‌వుడ్, బుమ్రా, కమిన్స్, అశ్విన్, జడేజా టాప్-6లో ఉన్నారు

## స్పోర్ట్స్

## ఇంగ్లండ్‌పై కార్టీ, కింగ్ సెంచరీలు.. వన్డే సిరీస్ విండీస్ వశం




ర్బడోస్: ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్ ను వెస్టిండీస్ 2-1 తేడాతో కైవసం చేసుకున్నది. బార్బడోస్‌లో జరిగిన మూడవ వన్డేలో వెస్టిండీస్ 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. విండీస్ బ్యాటర్లు కీసీ కార్టీ, బ్రండన్ కింగ్‌లు సెంచరీలతో చెలరేగారు. 264 టార్గెట్‌తో బరిలోకి దిగిన వెస్టిండీస్.. మరో ఏడు ఓవర్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని అందుకున్నది. కార్టీ 128, కింగ్ 102 రన్స్ చేశారు. వన్డేల్లో కార్టీ తొలి సెంచరీ నమోదు చేశాడు. 97 బంతుల్లో అతను సెంచరీ కొట్టాడు. 128 రన్స్‌తో అతను నాటౌట్‌గా నిలిచాడు. కింగ్ 113 బంతుల్లో వన్డేల్లో మూడవ సెంచరీ నమోదు చేశాడు.ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తడబడింది. ఓ దశలో 10 ఓవర్లలో 24 రన్స్‌కే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఫిల్ సాల్ట్ బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేశాడు. అతను 74 రన్స్ స్కోర్ చేశాడు. సామ్ కరన్ 40, డాన్ మోస్లే హాఫ్ సెంచరీ చేశారు. చివరలో జోఫ్రా ఆర్చర్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 38 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. శనివారం నుంచి రెండు జట్ల మధ్య టీ20 సిరీస్ ప్రారంభంకానున్నది. స్కోరు బోర్డు ఇంగ్లండ్ 263-8 (50 ఓవర్లు): ఫిల్ సాల్ట్ 74 (108)బీ ఫోర్డ్ 3-35 వెస్టిండీస్ 267-2 (43 ఓవర్లు): కార్టీ 128లి(114), కింగ్ 102 (117)బీ ఓవర్టన్ 1-17

## ఐపీఎల్ వేలంలోకి అండర్సన్



కొద్దిరోజుల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఇంగ్లండ్ దిగ్గజ బౌలర్ జేమ్స్ అండర్సన్.. తొలిసారి ఐపీఎల్ వేలంలో పేరు నమోదు చేసుకున్నాడు. ఇంతవరకూ ఫ్రాంచైజీ క్రికెట్ (టీ20) ఆడని అండర్సన్.. ఇంగ్లండ్ తరఫున 2014లో చివరిసారి ఆడాడు. 42 ఏండ్ల ఈ దిగ్గజ పేసర్.. రూ. 1.25 కోట్ల కనీస ధరతో తన పేరును నమోదుచేసుకున్నాడు.రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, అశ్విన్, చాహల్‌తో పాటు వెంకటేశ్ అయ్యర్, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమీ, ఇషాన్ కిషన్ వంటి భారత స్టార్ ఆటగాళ్లు రూ. 2 కోట్ల కనీస ధరతో వేలంలోకి రానున్నారు. ఈ ఏడాది జూన్‌లో ముగిసిన టీ20 వరల్డ్ కప్‌లో మెరిసిన భారత సంతతి అమెరికా పేసర్ నేత్రవల్కర్ సైతం ఐపీఎల్ ఆడేందుకు ఆసక్తి చూపుతున్నాడు. రూ.30 లక్షల కనీస ధరతో అతడు వేలంలో పేరు నమోదు చేసుకున్నాడు. అంతేగాక ఈసారి ఆక్షన్‌లో ఇటలీ ఆటగాడు థామస్ డ్రాకా కూడా అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు.

## విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీకి భూమి పూజ చేసిన పీవీ సింధు



విశాఖ  లో బ్యాడ్మింటన్ అకాడమీకి స్టార్ ప్లేయర్ పీవీ సింధు భూమి పూజ చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అకాడమీ నిర్మాణానికి తన తల్లిదండ్రులతో కలిసి గురువారం ఉదయం భూమి పూజ చేశారు. పనులు త్వరగా చేపట్టి ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఈ సందర్భంగా పీవీ సింధు తెలిపారు.ఈ భూమి విషయంలో ఎలాంటి వివాదం లేదని.. ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చినట్లు వివరించారు. ఈ అకాడమీ ద్వారా ఎంతో మంది క్రీడాకారులను తయారు చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అకాడమీకి సంబంధించిన అన్ని వివరాలూ త్వరలోనే వెల్లడిస్తామని ఈ సందర్భంగా పీవీ సింధు వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వం పీవీ సింధుకు విశాఖపట్నంలోని పెదగదిలి కూడలి సమీపంలో భూమి కేటాయించిన విషయం తెలిసిందే.

# అందాలతో గాలాలు వేస్తోన్న కుర్ర బ్యూటీ..

ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి తక్కువ సమయంలోనే క్లిక్ అయిన హీరోయిన్ నభా నటేష్. 2018లో సుధీర్ బాబు నటించిన నన్ను దోచుకుందువటే సినిమాతో తెలుగు సినిమా ఇండస్ట్రీకి పరిచయమైంది అందాల భామ నభా నటేష్.అంతకు ముందు కొన్ని కన్నడ సినిమాల్లో మెరిసిందీ అందాల తార. పూరి జగన్నాథ్ తెరకెక్కించిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైందీ అందాల తార. ఇస్మార్ట్ శంకర్ తన అందం నటనతో ఆకట్టుకుంది.ఆతర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది. డిస్కో రాజా, అదుగో, సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో తదితర సినిమాల్లో నటా నటేష్ అభినయానికి మంచి మార్కులు పడ్డాయి. కానీ ఆ సినిమాలేమీ హిట్ కాలేదు.దాంతో ఈ అమ్మడికి అవకాశాలు తగ్గాయి. అదే సమయంలో ప్రమాదానికి గురవ్వడంతో సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. ఇక ఇప్పుడు తిరిగి కోలుకొని వరుసగా సినిమాలను లైనప్ చేసింది. కానీ ఈ అమ్మడు ఆశించిన స్థాయిలో గుర్తింపు మాత్రం దక్కించుకోలేకపోతోంది. చివరిగా డార్లింగ్ అనే సినిమా చేసింది. ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఇక సోషల్ మీడియాతోనే ఎక్కువ సమయం గడుపుతోంది. ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ ఫోటోలకు ఫోజులిస్తుంది. ఆఫర్స్ అందుకోవడంలో వెనకబడిన అందాలతో అభిమానులను కవ్వించడంలో మాత్రం ఈ భామ తోపే..





# అనుష్క బర్త్డే స్పెషల్...


## ఘాటి ఫస్ట్ లుక్ రిలీజ్

టాలీవుడ్ నటి అనుష్క శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఘాటి. ఈ సినిమాకు వేదం, కంచె చిత్రాల దర్శకుడు జాగర్లమూడి కృష్ణ (క్రిష్) దర్శకత్వం వహిస్తున్నాడు. 4 ఏండ్ల నుంచి షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నేడు షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అయితే నేడు అనుష్క పుట్టినరోజు సందర్భంగా ఆమెకి శుభాకాంక్షలు తెలుపుతూ ఘాటి నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. బాధితురాలు, క్రిమినల్, లెజెండ్. అంటూ అనుష్క పోస్టర్‌ని పంచుకున్నారు. ఈ పోస్టర్‌ను చూస్తుంటే.. అరుంధతి తర్వాత మళ్లీ అలాంటి పవర్‌ఫుల్ రోల్‌లో అనుష్క నటించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా గ్లింప్స్‌ను నేడు సాయంత్రం 4.05 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కొండపోలం వంటి భారీ డిజాస్టర్ తర్వాత క్రిష్ దర్శకత్వంలో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్ తెరకెక్కిస్తుంది.

# బాలీవుడ్ స్టార్ హీరోతో సమంత హాట్ ఫొటో షూట్

సమంత, వరుణ్ ధావన్ నటించిన 'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్ సిరీస్ గురువారం ( నవంబర్ 07) నుంచి అమెజన్ ప్రైమ్ వీడియలో స్ట్రీమంగ్ కు వచ్చేసింది.ఇద్దరు స్టార్ నటులు సమంత, వరుణ్ ధావన్ నటిస్తున్న ఈ వెబ్ సిరీస్ పై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రమోషన్లు కూడా గట్టిగానే నిర్వహించారు.'సిటాడెల్: హనీ-బనీ' వెబ్ సిరీస్ ప్రమోషన్స్ గత నెల రోజులుగా జరుగుతున్నాయి. వెబ్ సిరీస్ టీమ్ కూడా లండన్ వెళ్లి ప్రమోషన్స్ చేసింది. ఇప్పుడు 'సిటాడెల్' ప్రమోషన్ కోసం వరుణ్ ధావన్, సమంత ఫోటో షూట్ చేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి.'సిటాడెల్: హనీ బన్నీ' మూడేళ్ల షూటింగ్ తర్వాత ఇప్పుడు వెబ్ సిరీస్‌ను విడుదల చేస్తోంది. కాబట్టి దీనిపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ 'సిటాడెల్' ఇంగ్లీష్ వెబ్ సిరీస్‌లో ప్రియాంక చోప్రా, హాలీవుడ్ నటుడు రిచర్డ్ మాడెన్ నటించారు





# పుష్పరాజ్ ఫీవర్..

## అల్లు అర్జున్‌తో పోటీపై విక్కీ కౌశల్ వెనక్కి తగ్గాడా..?

తెలుగుతోపాటు పాన్ ఇండియా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం పుష్ప 2 ది రూల్ . టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ సుకుమార్ కాంబోలో వస్తోన్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.మరోవైపు బాలీవుడ్ యాక్టర్ విక్కీ కౌశల్ నటిస్తున్న చిత్రం ఛావా . లక్ష్మణ్ ఉటేకర్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 06న విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారని తెలిసిందే. మహారాష్ట్ర చక్రవర్తి ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. ఈ రెండు సినిమాలలో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తోంది. పుష్ప ది రూల్ సినిమాపై ఇప్పటికే సూపర్ బజ్ క్రియేట్ అవడమే కాదు.. విడుదలకు ముందే నిత్యం వార్తల్లో నిలుస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ఇక పుష్పరాజ్ మేనియాతో విక్కీ కౌశల్ టీం విడుదల విషయంలో వెనక్కి తగ్గినట్టు ఓ వార్త నెట్టింట వైరల్ అవుతోంది. మరి నిజంగానే ఛావా అనుకున్న సమయానికి రావడం లేదనేది కేవలం పుకారు మాత్రమేనా..? నిజమా..? అనేది తెలియాల్సి ఉంది. పుష్ప 2 ది రూల్‌లో మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీ రోల్ చేస్తుండగా.. భన్వర్ సింగ్ షెకావత్ పాత్రలో మరోసారి సందడి చేయబోతున్నాడు. సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, అజయ్ ఘోష్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు



# ఉన్నపలంగా టాలీవుడ్ ని తలుచుకుంటున్న సీత.!

మీరు మమ్మల్ని గుర్తుచేసుకుంటే, మేం మిమ్మల్ని తలచుకోకుండా ఉంటామా? అని అంటున్నారు ఆడియన్స్.ఇంతకీ రాముడు మెచ్చిన సీత టాలీవుడ్‌ని ఎందుకు తలచుకున్నట్టు... ఆమె గురించి మన వాళ్లు ఎందుకు ఆరా తీస్తున్నట్టు. దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి నటించిన లక్కీ భాస్కర్‌కి తన స్టైల్‌లో రివ్యూ ఇచ్చేశారు మేడమ్ మృణాల్.తప్పక చూడాల్సిన సినిమా అంటూ ఆమె ఇచ్చిన కాంప్లిమెంట్‌కి ఫిదా అవుతున్నారు దుల్కర్ ఫ్యాన్స్. మృణాల్, దుల్కర్ నటించిన సీతా రామమ్‌ని గుర్తుచేసుకుంటున్నారు అభిమానులు.సీతారామమ్ ఫ్రెండ్‌షిప్ వల్లే ఈమె స్పందించారన్నది కొందరి మాట. అయితే ఈ మధ్య తెలుగు ఇండస్ట్రీకి దూరమైన ఈ లేడీ.. మళ్లీ ఇటు రావడానికి ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారన్నది మరి కొందరు చెబుతున్న న్యూస్..ఫ్యామిలీస్టార్ ఫొటోను ఓ నెటిజన్ ఎడిట్ చేసిన తీరుకు మృణాల్ ఆగ్రహం వ్యక్తం చేసిన తీరు కూడా నెట్టింట్లో ప్రస్తుతం ట్రెండ్ అవుతోంది.అన్నట్టు... సౌత్‌లో వరుసగా పెర్ఫార్మెన్స్ ఓరియంటెడ్ రోల్స్ కి ఇంపార్టెన్స్ ఇస్తున్న ఈ లేడీ, నార్త్ లో మాత్రం గ్లామరస్ రోల్స్ కి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. మరి సౌత్‌లోనూ గ్లామర్‌కి ఇంపార్టెన్స్ ఉన్న రోల్స్ వస్తే చేస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ..

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492